RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి : 3, సంచిక : 290

శుక్రవారం
అక్టోబర్ 24, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00

దినపత్రిక



బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రధాని జోక్యం చేసుకోవాలి

3లో..

- ☐ బంగారు భవిష్యత్తు పెడదారి
- ☐ జీవితాలపై తీవ్ర ప్రభావం
- ☐ నేరాల పెరుగుదల..

వ్యసనాలకు అడ్డుకట్ట పడాలి



# మత్తు.. యువత చిత్తు!

**వేద న్యూస్, డెస్క్:**

దేశ భవిష్యత్తు యువతరం అని నిపుణులు చెబుతున్నారు. కానీ, ఆధునిక సమాజంలో యువతరం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన సవాలు ఎదుర్కొంటున్నది. మత్తు పదార్థాల వ్యసనం, ఆల్కహాల్, గంజాయి, ఇతర ప్రమాదక రమైన రసాయన మత్తు పదార్థాల వినియోగం చిన్న వయస్సులోనే ప్రారంభమవుతున్నది. కేవలం ఉత్సాహం కోసమో, స్నేహితుల ఒత్తిడి వలనో, లేదా జీవితంలో కలిగే తాత్కాలిక ఒత్తిడి నుండి తప్పించుకోవడం కోసమో మొదలుపెట్టే ఈ అలవాటు, నెమ్మదిగా వారిని బానిసలుగా మారుస్తోంది.



**- క్షణికావేశపు నిర్ణయం.. అంధకారం**

తొలిసారిగా తీసుకున్న క్షణికావేశపు నిర్ణయం, వారి బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుంది. ఈ మత్తు పదార్థాల లభ్యత సులభతరం కావడం, సరిహద్దులు దాటి అక్రమంగా రవాణా కావడం వంటి కారణాల వల్ల, ఈ వ్యసనం పట్టణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాలకు కూడా వేగంగా విస్తరిస్తోంది. దీని ఫలితంగా, దేశం శక్తిమం తమైన యువతరం తమ విద్యా, ఉద్యోగ అవకాశాలను చేజేతులా కోల్పోతున్నారు. మత్తు పదార్థాల వ్యసనం యువత జీవితాలను అనేక విధాలుగా నాశనం చేస్తు న్న ది. మొదటిది, విద్యారంగం. వ్యసనానికి గురైన విద్యార్థులు ఏకాగ్రత కోల్పోతారు, జ్ఞాపకశక్తి తగ్గుతుంది, తరగతులకు గైర్హాజరు కావడం జరుగుతుంది, దీని ఫలితంగా వారు చదువులను మధ్యలోనే ఆపేయాల్సి వస్తుంది. రెండవది, ఆరోగ్యం. దీర్ఘకాలికంగా మత్తు పదార్థాలను వాడటం వల్ల కాలేయం, మెదడ, నాడీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటాయి. మానసిక సమస్యలు, కుంగుబాటు (డిప్రెషన్) మరియు ఆందోళన వంటి సమస్యలు పెరుగుతాయి. మూడవది, కుటుంబ సంబంధాలు. యువత తమ వ్యసనం కోసం అబద్ధాలు ఆడటం, డబ్బు దొంగిలించడం వంటివి చేయడం వల్ల కుటుంబంలో కలహాలు పెరుగుతాయి, తల్లిదండ్రులు, తోబుట్టువుల మధ్య నమ్మకం పూర్తిగా సన్నగిల్లుతుంది. ఈ విధమైన నష్టం కారణంగా, దేశం యొక్క భవిష్యత్తుకు కీలకమైన మానవ వనరు (హ్యూమన్ రిసోర్స్) దెబ్బతింటోంది.

**- సామాజిక విధ్వంసం**

యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం వ్యక్తిగత సమస్యగానే కాకుండా, సామాజిక

మిగతా 3వ పేజీలో..




## బాధ్యతలు స్వీకరించిన గరిమా అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి అదనపు కలెక్టర్ చేరుకోగా, అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్ పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఎం హరిత సెలవుపై వెళ్లగా, ఇంచార్జి కలెక్టర్ గా సైతం గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక తరలింపుపై రైతుల ఆందోళన



**వేద న్యూస్, కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామ పరిధిలోని మూల వాగు నుండి స్థానిక తాసిల్దార్ అనుమతితో ఇసుక రవాణా జరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇసుక తరలింపు అనుమతులు ఉండడంతో చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో ట్రాక్టర్లు కొండాపూర్ వాగుకు చేరుకుంటున్నాయి. దీంతో స్థానిక రైతులు,గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ట్రాక్టర్లను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. ఇతర గ్రామాల నుండి ఇసుక ట్రాక్టర్లు అధిక సంఖ్యలో వచ్చి ఇసుకను తరలించడం వలన కొండాపూర్ గ్రామ భూగర్భ జలాలు, గ్రామానికి నీటి సరఫరా చేసే నల్లల బావి త్వరగా అడుగంటిపోతాయని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో పంటలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడతామని ఆవేదన చెందారు. తాసిల్దార్ కార్యాలయం జారీ చేసిన ఇసుక అనుమతులను కేవలం కొండాపూర్ గ్రామస్థులకు మాత్రమే పరిమితం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇతర గ్రామాల వారికి అనుమతులు ఇవ్వడం ఆపివేసి, గ్రామ భూగర్భ జలాలను కాపాడాలని వారు కోరారు. ఇసుక తరలింపు జరుగుతున్న చోట ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. పరిస్థితి అదుపులోకి రావడానికి రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరుపుతున్నారు.

## రోడ్ల నిర్మాణ,మరమ్మత్తుల పనులు శరవేగంగా పూర్తి చేయాలి



**- రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**వేద న్యూస్, టేక్మాల్ :**

మెదక్ జిల్లా ల పంచాయత్ రాజ్ , ఆర్ బి శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సంగారెడ్డి లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సంగారెడ్డి, మెదక్ జిల్లాలలో విస్తరించి ఉన్న అందోల్ నియోజక వర్గ పరిధిలో పంచాయత్ రాజ్ శాఖ అద్వర్యంలో చేపట్టుతున్న రోడ్ల నిర్మాణ పనులు , ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తుల పనులు శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అందోల్ నియోజక వర్గంలో పంచాయత్ రాజ్ శాఖ అద్వర్యం లో గ్రామీణ ఉపాధి హామీ పథకం లోచేస్తున్న రోడ్ల నిర్మాణ , మరమ్మత్తుల పనులు , కొత్తగా నిర్మిస్తున్న అంగన్వాడీ

మిగతా 3వ పేజీలో..



## హైదరాబాద్‌కు సౌత్‌వెస్ట్ పెట్టుబడులు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

అమెరికాకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ తన ప్రపంచ స్థాయి నూతన ఆవిష్కరణల కేంద్రం (గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. అంతర్జాతీయ పెట్టుబడులకు, సాంకేతిక అభివృద్ధికి కేంద్రంగా మారుతున్న హైదరాబాద్‌లో ఈ కేంద్రాన్ని నెలకొల్పాలని సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వాగతించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో సౌత్‌వెస్ట్ విమానయాన సంస్థ ప్రతినిధుల బృందం తమ నిర్ణయాన్ని వెల్లడించింది. సంస్థకు చెందిన సమాచార విభాగం ప్రధాన అధికారి (చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్) లారెన్ వుడ్స్, సాంకేతిక విభాగం ప్రధాన అధికారి (చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్) టామ్ మెరిట్ నేతృత్వంలోని ఈ బృందం పెట్టుబడులకు సంబంధించిన ప్రణాళికలను ముఖ్యమంత్రికి అందించింది. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనుకూల విధానాలు, పురోగతి లక్ష్యాలను ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము కట్టుబడి ఉన్నామని, వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

మిగతా 4వ పేజీలో..

## గ్రూప్-1 అక్రమాలపై సుప్రీంకోర్టుకు కవిత లేఖ

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఈ అంశాన్ని సుమోటోగా (స్వయంగా) స్వీకరించి, నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రూప్-1 నియామకాల ప్రక్రియలో రాష్ట్రపతి ఉత్తర్వులను (ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను) ఉల్లంఘించారని నిరుద్యోగులు తన దృష్టికి ఫిర్యాదు చేసినట్టు కవిత తన లేఖలో పేర్కొన్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు విరుద్ధంగా నియామకాలు జరగడం పట్ల నిరుద్యోగులు లేవనెత్తుతున్న అంశాలపై తక్షణమే విచారణ జరిపించాలని ఆమె కోరారు. గ్రూప్-1 పరీక్షల్లో



ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్ నంబర్, మెయిన్స్‌కి మరొక హాల్ టికెట్ నంబర్ ఇవ్వడం పట్ల విద్యార్థులు తీవ్ర అనుమానాలు వ్యక్తం

మిగతా 4వ పేజీలో..

## బండ్లగూడలో భారీగా గంజాయి పట్టివేత

**- రూ.2.7 కోట్ల విలువైన 908 కిలోల గంజాయి స్వాధీనం**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

నగరంలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ముగ్గురు వ్యక్తులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.2.7 కోట్ల బహిరంగ మార్కెట్ విలువ గల 908 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా



మహారాష్ట్రలోని నాసిక్ వైపు గంజాయిని రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అరెస్ట్ అయిన నిందితులను డ్రైవర్/ట్రాన్స్‌పోర్టర్

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

శుక్రవారం అక్టోబర్ 24, 2025

# పంచాయతీ సెక్రెటరీ అరెస్టు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ఓగులాపూర్ గ్రామపంచాయతీ చెందిన మాజీ పంచాయతీ కార్యదర్శి అయినా సయ్యద్ ముక్తార్ అహ్మద్ ప్రస్తుతం వీర్నపల్లి మండలం నకు బదిలీ అయినాడు. గతంలో ఓబులాపూర్ గ్రామ పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వహించిన సమయంలో 2025 సంవత్సరంలో జనవరి నుండి మే నెల వరకు వరకు ఓగులాపూర్ గ్రామపంచాయతీ నందు విధులు నిర్వహిస్తున్న ఐదుగురు మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వలేదని గతంలో కలెక్టర్ కి మల్టీపర్పస్ వర్కర్లు విజ్ఞప్తి చేసుకోవడం జరిగింది. అయితే ఆ విషయంపై పంచాయతీరాజ్ అధికారులు చేసిన విచారణలో సదరు పంచాయతీ సెక్రెటరీ మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వకుండా ఆ డబ్బులు మొత్తం 1,42,000/- లను తానే ఐదు చెక్కుల ద్వారా డ్రా చేసుకొని తన వ్యక్తిగత అవసరాల కోసం వాడుకోవడం జరిగింది అని విచారణలో తెలిసింది. ఈ విషయం గురించి మండల పంచాయతీ అధికారి అయినా మాణిక్యరావు శ్రీనివాస్. ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేయడం జరిగింది. తగిన సాక్షాధారాలు సేకరించిన తర్వాత ఈరోజు పంచాయతీ సెక్రటరీ అయిన ముక్తార్ అహమ్మద్ ను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థులకు అందుబాటులో ఉన్నత విద్య

**వేద న్యూస్, చొప్పదండి గంగాధర :**




గంగాధర మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది. డిగ్రీ విద్య కోసం కరీంనగర్, జగిత్యాల వంటి పట్టణాలకు వెళ్లి చదువుకోవడం వ్యయ ప్రయాసలతో కూడుకున్నది కావడంతో చాలామంది పేద విద్యార్థులు చదువును ఇంటర్మీడియట్ తోనే ఆపేస్తున్నారు. నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందన్న సదుద్దేశంతో మేడిపల్లి సత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువెళ్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించారు. గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తుండడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం. గురువారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు విద్యార్థుల కృతజ్ఞతలు తెలిపారు.

# విత్తనోత్పత్తి క్షేత్రాల క్షేత్ర సందర్శన

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం అనే నినాదంతో ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రాష్ట్రంలోని ప్రతి గ్రామములో ముగ్గురు రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన నాణ్యమైన విత్తనాన్ని వ్యవసాయ శాఖ ద్వారా ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా ఈ రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలములోని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్, అలాగే వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో రైతులు సాగు చేస్తున్న విత్తనోత్పత్తి క్షేత్రాలు (డబ్ల్యూ జి ఎల్ 915 మరియు డబ్ల్యూ జి ఎల్ 44) మీద క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా వానాకాలంలో రైతులకు పంపిణీ చేసిన నాణ్యమైన వరి విత్తనాలను పండిస్తున్న రైతుల నుండి ఆయా గ్రామాలలోని మిగతా రైతులందరూ కూడా ఈ విత్తనాన్ని తీసుకొని మంచి దిగుబడులు పొందాలని సూచించారు. తదుపరి నాణ్యమైన విత్తన సాగు చేస్తున్న రైతులు అనుభవాలను తెలియపరుస్తూ, రాబోవు కాలంలో ఇతర రైతులకు కూడా వాళ్ళు ఉత్పత్తి చేసిన విత్తనాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. తదుపరి విత్తనోత్పత్తి క్షేత్రాలను మరియు చిరు సంచి దశలో ఉన్న వరి వంగడాల క్షేత్రాలను శాస్త్రవేత్తలు అలాగే అధికారుల బృందం పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ శాస్త్రవేత్త డా. ఇ. రజనీకాంత్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్త డా. కె. మదన్ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రణీత,రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా సన్మానం



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివి ప్రస్తుతం నీట్(పిజీ)ఎంట్రన్స్-2025 పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ 2136 సాధించినందుకు గాను ముదుగంటి సాయి దినేష్ రెడ్డి,ని అంబెడ్కర్ గ్లోబల్ మిషన్ ప్రిన్సిపుల్ మిషన్-ముంబాయి సంస్థ సెక్రటరీ వి.ఎం ఆదిశేష్ సూర్యదేవ్, సుంకపాక చక్రవర్తి, ఆధ్వర్యంలో విలాసాగర్ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్, మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని మన పాఠశాలలో చదివి ఈరోజు నీట్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించాడు.విద్యార్థులందరు సాయి దినేష్, ను ఆదర్శంగా తీసుకోని మంచి స్థాయికి ఎదగాలని సూచిస్తూ వారి తల్లిదండ్రులను అభినందించారు, తదుపరి సుంకపాక చక్రవర్తి, మాట్లాడుతూ దినేష్ రెడ్డి, చాలా సామాన్య కుటుంబంలో పుట్టి వారి తల్లిదండ్రుల, గురువుల ప్రోత్సాహంతో నేడు డాక్టర్ గా నీట్ లో ఆల్ ఇండియా 2136 వ ర్యాంక్ సాధించడం చాలా గర్వంగా ఉంది ఇంతటి గొప్ప స్థాయికి వెళ్ళడానికి కృషి చేస్తున్న వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.సన్మాన గ్రహీత సాయి దినేష్ రెడ్డి, మాట్లాడుతూ ఈ రోజు ఈస్థాయికి రావడానికి చిన్ననాటి నుండి నేటి వరకు అక్షరమాలను అందించిన ప్రతి గురువుకు, నా తల్లిదండ్రులకు ఎల్లప్పుడూ ఋణపడి ఉంటాను, విరందరి ప్రోత్సాహం వలనే ఇంతటి ర్యాంక్ సాధించాను, నా విజయానికి కారకులైన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు. నాలాగే ఈ పాఠశాలలో చదివే వారు కూడా మంచి స్థాయిలో ఉండాలని సూచించారు. పాఠశాల చైర్మన్ సుజాత, మాట్లాడుతూ ఈ విజయం గ్రామానికే గర్వకారణం అన్నారు.ఈ కార్యక్రమంలో సాయి దినేష్ రెడ్డి, తల్లిదండ్రులు సుజాత-శ్రీనివాస్ రెడ్డి, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# మహిళా జర్నలిస్టులపై దాడి సిగ్గుచేటు

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్వి నాయకులు కొమ్ముల శివ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం ఏర్పాటుచేశారు .ఈ సమావేశం బిఆర్ఎస్వి నాయకులు కొమ్ముల శివ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య ,మహిళా జర్నలిస్టు లని కూడా చూడకుండ వారిపై దుర్భాషలాడుతూ దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అని వారు అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగించాలని రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని రాబోయే కాలంలో విద్యార్థులు, యువకులు ,ప్రజల చేతుల్లో తగిన గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా ఈటువంటి చర్యలు మానుకోవాలని లేని పక్షంలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి సీనియర్ నాయకులు బెరుగు తరుణ్ గోపి ,కళాశాల అధ్యక్ష కార్యదర్శులు అభిలాష్ ,సిద్దు, శివకుమార్, ప్రశాంత్ ,వినయ్ ,వంశీ ,సాయి కృష్ణ తేజ, గణేష్, మున్ని ,నాని ,మేఘనాథ్ ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల మహోత్సవల్లో భాగంగా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్,జగిత్యాల్, ఆదేశానుసారం ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల్ పోలీస్ కళాబృందం వారిచే ఇబ్రహీంపట్నం జూనియర్ కాలేజ్ లో విద్యార్థులకి సైబర్ క్రైమ్, ఉమెన్ ట్రాఫికింగ్, డ్రగ్స్, మరియు ఇతరత్రా అంశాల పైన జానపద రూపకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 25శనివారం మెట్పల్లి సర్కిల్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని యువత ఎవరైనా రక్తదానం చేయడనికి ఆసక్తి ఉంటే శనివారం మెట్టుపల్లి సర్కిల్ కార్యాలయం వద్దకి వచ్చి రక్తదానం చేయాలని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

# సమగ్ర సమాచారంతో ప్రతిపాదనలు సిద్ధం చేయండి

**వేద న్యూస్, వరంగల్:**



నగరం లో సాస్కి( స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ ) పథకం అమలుకు సమగ్ర సమాచారంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు.గురువారం కుడా కార్యాలయం లోని మినీ సమావేశమందిరంలో సాస్కి పథకం అమలులో భాగంగా కుడా ,బల్దియా లోని పట్టణ ప్రణాళిక ఇంజనీరింగ్ శానిటేషన్ తో పాటు పలు విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో కమిషనర్ పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సాస్కి పథకానికి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకొని అన్ని అంశాలను క్రోడీకరించి వారం లోగా పూర్తి సమాచారం అందజేయాలని రూపకల్పన లో భాగంగా నగరం లో గల పురాతత్వ విధానాలను ప్రోత్సహించి అభివృద్ధి చేయాలని, పాదచారులు నడిచే మార్గాలను అభివృద్ధి చేయడం మౌలిక వసతులను కల్పించడం ప్రజల రక్షణ చర్యలు చేపట్టడం సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పార్కుల అభివృద్ధి, ఓపెన్ స్పేస్ లను అభివృద్ధి చేయడం స్పాంజ్ సిటీ ఏర్పాటు ఇందుకోసం అనువైన స్థలాన్ని గుర్తించడం సిటీ గ్రీన్ కార్యక్రమం లో నగరం లో గ్రీనరీ ఏర్పాటు కు చర్యలు చేపట్టడం పురాతన బావుల పునరుద్ధరణ తదితర అంశాల పట్ల దృష్టి సారించి నమోదు చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమం లో ఎస్ ఈ సత్యనారాయణ, కుడా సిపిఓ అజిత్ రెడ్డి,సి ఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, సిహెచ్ఓ రమేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి,ఈ ఈ లు రవికుమార్,సంతోష్ బాబు ,డిఈ లు రవి కిరణ్, శివానంద్ స్మార్ట్ సిటీ పి ఎం సి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

# ‘మత్తు’..యువత చిత్తు!



భద్రతకు తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తుంది. మత్తులో ఉన్నప్పుడు విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం పెరుగుతుంది. వ్యసనాన్ని కొనసాగించడం కోసం డబ్బు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలు, దోపిడీలు, కొన్నిసార్లు హత్యలు వంటి ఘోరమైన నేరాలకు కూడా పాల్పడుతున్నారు. ఈ విధంగా, వీరు కేవలం తమ జీవితాలనే కాకుండా, సమాజంలో శాంతి భద్రతలను కూడా నాశనం చేస్తున్నారు.మత్తు పదార్థాల ప్రభావంతో వీరు రోడ్డు ప్రమాదాలకు గురవడం, లేదా ఇతరుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టడం వంటివి కూడా జరుగుతున్నాయి. ఇది సమాజంలో భయాన్ని, అస్థిరతను పెంచుతుంది.

**– నిపుణుల సూచనలు**

యువత ఈ విధంగా పెడదారి పడుతుండటం చూసి తల్లిదండ్రులు పెద్దలు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. తమ పిల్లలను ఈ వ్యసనం నుండి ఎలా రక్షించుకోవాలి, వారికి ఎలా మార్గనిర్దేశం చేయాలి అనే విషయంలో వారు సతమతమవుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కేవలం చట్టపరమైన చర్యల ద్వారానే కాకుండా, సమగ్రమైన సామాజిక కృషి ద్వారా సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. విద్యా సంస్థలు తమ పాఠ్యాంశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే హాని గురించి అవగాహన కార్యక్రమాలను కచ్చితంగా చేర్చాలి. కుటుంబాలు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి, వారి ఒత్తిడిని అర్థం చేసుకోవాలి, వారు ఎటువంటి స్నేహితులతో తిరుగుతున్నారో నిశితంగా గమనించాలి. యువతలో స్వీయ నియంత్రణ, మానసిక ధైర్యాన్ని పెంచే కార్యక్రమాలు అవసరం.

**– పరిష్కార మార్గాలు: ఉమ్మడి బాధ్యత**

ఈ మత్తు పదార్థాల సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వం, విద్యాసంస్థలు, కుటుంబాలు కలిసికట్టుగా కృషి చేయాలి. ప్రభుత్వం అక్రమ మత్తు పదార్థాల సరఫరాను, అమ్మకాలను అరికట్టడానికి మరింత కఠినమైన చట్టాలను అమలు చేయాలి. ముఖ్యంగా విద్యా సంస్థల సమీపంలో వీటి విక్రయాలను పూర్తిగా నిషేధించాలి. వ్యసనానికి బానిసల్కెన యువత కోసం తగినన్ని పునరావాస కేంద్రాలు (రీహాబిలిటేషన్ సెంటర్స్) ఏర్పాటు చేయాలి, అక్కడ వారికి వైద్యపరమైన మరియు మానసిక కౌన్సెలింగ్ అందించాలి. యువత తమ సమయాన్ని నిర్మాణాత్మకమైన కార్యకలాపాలు, క్రీడలు, సృజనాత్మక అంశాలపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలి. ఈ విధంగా ఉమ్మడి బాధ్యతతో పనిచేసినప్పుడే, మనం ఈ యువతరాన్ని మత్తు కోరల నుండి రక్షించి, వారికి నిజమైన బంగారు భవిష్యత్తును అందించగలుగుతాము.

# ఆత్మహత్య చేసుకున్న మహిళ..!

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన పెంద్యాల నర్సమ్మ,( 65) గురువారం ఉదయం విలాసాగర్ చెరువులో మహిళా మృతదేహం లభ్యమైంది. ఆమె ఆరోగ్య సమస్యల కారణంగా మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు అమె కొడుకు పెంద్యాల శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేయగా బోయినిపల్లి ఎస్ ఐ రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తేలిపారు.

# వ్యాపారులకు ధాన్యం అమ్మవద్దు

**వేద న్యూస్, చొప్పదండి రామడుగు :**



ఆరుకాలం కష్ట పడి పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని వ్యాపారులకు అమ్మి ఇబ్బందుల పాలు కావద్దని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సెర్ఫ్ వారి ఆధ్వర్యంలో వెదిరలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సన్న రకాలకు ఐదు వందల రూపాయలు బోనస్ చెల్లించే విషయం రైతులకు వివరించాలని అధికారులకు సూచన చేశారు.

# రోడ్లు నిర్మాణ,మరమ్మత్తుల పనులు శరవేగంగా పూర్తి చేయాలి

భవనాల నిర్మాణ పనులు , వివిధ పాఠశాలలలో నిర్మిస్తున్న టాయిలెట్స్ బ్లాక్స్ ల నిర్మాణ పనులపై చర్చించారు. నియోజక వర్గం లో చేపట్టిన మండల కేంద్రాల నుండి గ్రామాలకు వెళ్లే కనెక్టింగ్ రోడ్స్ ల పనులు త్వరగా పూర్తి చేయాలనీ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు . అనంతరం సంగారెడ్డి జిల్లా రహదారుల భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు . ఈ సమీక్షలో గార్లపల్లి – అజ్జమర్రి బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతి పై చర్చించారు. ఈ సమీక్షలో పి ఆర్ డిపార్ట్మెంట్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఎస్ ఇ జగదీశ్వర్ ,ఇ ఇ నర్శిములు , ప్రభాకర్ , డై డి డి కృష్ణ , ఇతర ఇంజనీరింగ్ అధికారులు , ఆర్ బి శాఖ అధికారులు ఇఇ నర్శిములు, డిఇ రవీందర్ లు పాల్గోన్నారు .



# కాంగ్రెస్ సర్కారు రైతుల పాలిట శాపంగా మారింది

## – మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**వేద న్యూస్, చొప్పదండి :**

కాంగ్రెస్ సర్కారు అలసత్వం మరోసారి రైతుల పాలిట శాపంగా మారిందని, చొప్పదండి మాజీ శాసన సుంకె రవిశంకర్ అన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మళ్లీ నష్టాల మూటే మిగలనుందని, వానకాలం కోతలు ఇప్పటికే మొదలైనా.. సర్కారు ఇంకా కొనుగోలు కేంద్రాలనే ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతల్లో అయోమయం నెలకొన్నదని అన్నారు. ఈ నెల ఒకటి నుంచే కేంద్రాలను ప్రారంభిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. నియోజకవర్గం లో అత్యధిక ప్రాంతాల్లో నేటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనేలేదని, కొన్నిచోట్ల ఆర్భాటంగా రిబ్బన్ కట్‌చేసినా కోనుగోళ్లు మాత్రం చేపట్టడంలేదని అన్నారు. దీంతో పలుచోట్ల కేంద్రాల వద్ద రైతులు 20 రోజులుగా పడిగాపులు పడుతున్నారని, ఇంత జరుగుతున్నా ఆయా కేంద్రాలకు మిల్లులు అలాట్‌మెంట్ చేయడంలో అధికార యంత్రాగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని అన్నారు. ఈ సమస్యపై జిల్లాల ఇ%శీ%చార్జి మంత్రులు కనీసం సమీక్షలు చేసిన పాపాన పోలేదని, మరోవైపు వర్షాలొస్తాయని వాతావారణ శాఖ హెచ్చరికలు చేస్తున్న తరుణంలో ఆన్నదాతల్లో ఆందోళన నెలకొన్నదని, నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే దుస్థితి ఏర్పడిందని అన్నారు. బోనస్‌కు ఎగనామం పెట్టేందుకే కొనుగోలు కేంద్రాల ప్రారంభ విషయంలో కాంగ్రెస్ సర్కారు అలసత్వం చూపుతున్నదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ధాన్యం కొనుగోలుపై కాంగ్రెస్



ప్రభుత్వం, అడుగడుగునా ప్రణాళిక లోపం స్పష్టంగా కనబడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# రైతుల పొట్టగొట్టడం సిగ్గు చేటు

**వేద న్యూస్, రుద్రూర్ :**

రైతులు పండించిన పంటకు రైస్ మిల్లర్లు ఇష్టానుసారంగా తరుగు పేరుతో నిలువునా దోచుకుంటున్నారని, రైతులు ఎండనకవాననక రైతు తాము పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందని సంతోషించాలో అధిక తరుగుతో మోసం చేస్తున్న రైస్ మిల్లర్లను పట్టించుకోని అధికారులను చూసి రైతులు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అయోమయంలో ఉన్నారని భారతీయ జనతా పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లు ట్రక్ షీట్లు ఇవ్వక అసలు తరుగు ఎండ పెడుతున్నారన్నది ఎవరికి అర్థం కావడంలేదని నిస్సాహయక స్థితిలో రైతులు ఉన్నారని అన్నారు. అకాల వర్షాల పట్ల రైతులు నిండా మునిగి చేతికొచ్చిన పంటకు కూడా తరుగు పేరుతో చేస్తున్న రైస్ మిల్లర్లు 40 కిలోల 500 గ్రాములు కాటా నిర్ణయించారని, మిల్లర్లు మంగళవారం వరకు 41 కేజీ, బుధవారం 41 జీ 100 గ్రాములు తరుగుతో ఉంటేనే రైస్ మిల్లర్లు తీసుకుంటానని చెప్పడం విశేషం. రైస్ మిల్లర్లు అదేశిస్తే అధికారులు ఖండించక పోగా, వారికి వత్తాసు పలుకుతున్నట్లుగా అధికారుల వ్యవహార శైలి మారిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు రోజుకు అరకిలో చొప్పున వాతావరణ పరిస్థితుల దృష్టా ఇదే అదునుగా చేసుకుని రైతులను తరుగు పేరుతో మోసం చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు.



# షేక్‌పేట్ డివిజన్‌లో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పాదయాత్ర

**వేద న్యూస్, హైదరాబాద్ :**



జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా షేక్‌పేట్ డివిజన్‌లో బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పాదయాత్ర నిర్వహించారు. రామాలయం ఆలయంలో ప్రత్యేక పూజలతో ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన, వినాయకనగర్, సీతానగర్, మారుతీనగర్ కాలనీల్లో ప్రజలను, ఓటర్లను కలిశారు. ప్రతి గడపకు వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి గోడలకు బీజేపీ స్టిక్కర్లు అతికించి, ప్రచార పత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల పాలుచేసిన రాష్ట్రాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం మూడు లక్షల కోట్ల అప్పులతో మరింత కష్టాల్లోకి నెట్టిందని మల్క కొమరయ్య తెలిపారు. బీఆర్‌ఎస్ కాంగ్రెస్ రెండు పార్టీలు ఒకే నాణానికి రెండు వైపులని, వీటికి బుద్ధి చెప్పే సమయం వచ్చిందని అన్నారు. ఈ ఉపఎన్నికలు సాధారణ ఎన్నికలు కాదని, తెలంగాణ భవిష్యత్తు దిశను నిర్ణయించే ఎన్నికలని స్పష్టం చేశారు.

మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, ఆసరా పెన్షన్‌ను రూ. 4 వేలు పెంచుతామని చెప్పి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తులం బంగారం వంటి మాయ మాటలతో ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసిందని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించి తెలంగాణలో మార్పుకు నాంది పలకాలని కోరారు. దీపక్ రెడ్డి ప్రజల సమస్యలపై పోరాడే నాయకుడని, అభివృద్ధి కోసం కృషి చేసే వ్యక్తి అని తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని, జూబ్లీహిల్స్ కూడా ఆ మార్పులో భాగమవ్వాలంటే కమలం గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. “మీ ఓటు మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కమలం పూవుకు ఓటు వేసి, బీజేపీని గెలిపించి, జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్లండి,” అని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పిలుపునిచ్చారు.

రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్,రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, అనిల్ గౌడ్, బిజెపి స్టేట్ జనరల్ సెక్రటరీ వీరేందర్ గౌడ్, బిజెపి సీనియర్ రాష్ట్ర నాయకులు డా.రఘునాథ్ చారీ లతో పాటు డివిజన్ పార్టీ అధ్యక్షులు రాకేష్, సెంట్రల్ జిల్లా పార్టీ కౌన్సిల్ మెంబర్ శివ కుమార్, డివిజన్ ప్రభారి బంగారు ప్రకాష్, నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రధాని జోక్యం చేసుకోవాలి

**వేద న్యూస్, హన్మకొండ:**



## – నరేంద్ర మోదీకి బీసీ జాక్ లేఖ

స్థానిక సంస్థలలో బీసీలకి 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని బిసి జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. హన్మకొండ హరిత కాకతీయ హోటల్ లో జరిగిన విలేకరుల సమావేశంలో లేఖని విడుదల చేసిన సందర్భంగా డాక్టర్ శేషు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్న బిల్లుపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం, రిజర్వేషన్లు తగ్గిపోయిన పరిణామాలు లేఖలో వివరిస్తూ రాజకీయ ప్రాతినిధ్యంలో ఎంబీసీ లకి సంచార జాతులకి జరిగిన అన్యాయాన్ని కూడా లేఖ ద్వారా ప్రధానమంత్రి కి తెలియజేసినారు. తమిళనాడు తరహాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 69 శాతం రిజర్వేషన్లని చట్టబద్ధం చేసి తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చిన విధంగానే తెలంగాణ స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో కూడా ప్రధానిగా మీరు జోక్యం చేసుకోవాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మహిళా బిల్లు సమస్యని ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించిన విధంగానే ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ల కోసం చూపిన చొరవ విధంగానే తెలంగాణలో బీసీల రిజర్వేషన్ల విషయంలో కూడా ప్రధాని జోక్యం చేసుకొని బీసీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా 42 శాతం రిజర్వేషన్లను సాధించటానికి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని రిజర్వేషన్ల కోసం పార్లమెంటును వేదికగా చేసుకొని పోరాడి రిజర్వేషన్లను సాధించాలని అభిప్రాయపడ్డారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన తరువాత రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదనే నిబంధనకి అర్థం లేదు కాబట్టి 50 శాతం పరిమితిని ఎత్తివేసి బిసి రిజర్వేషన్ల పెంపుకు సహకరించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. లేఖలో రిజర్వేషన్ల విషయంలో బీసీలకు జరుగుతున్న అన్యాయానికి సంబంధించిన పూర్తి వివరాలు లేఖ ద్వారా అందజేశాం కాబట్టి రిజర్వేషన్ల విషయంలో ప్రధాని జోక్యం చేసుకుంటారని ఆశిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ధారబోయిన సతీష్, ఎదునూరి రాజమౌళి, ఎంబీసీ నాయకులు డాక్టర్ పాలడుగుల సురేందర్, కాకతీయ యూనివర్సిటీ బీసీ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్, బుట్టి శ్యామ్ యాదవ్, సోమిడి అంజన్ రావు, చిన్నాల యశ్వంత్ యాదవ్, డా.విజయ్ కుమార్, డా.టి.నాగయ్య,దామెరకొండ కొమరయ్య, వేణు చారి, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

నాయకత్వ లక్షణాలు మరియు నైపుణ్యాలు

ఈ రోజుల్లో, ఒక వ్యక్తి ఉన్నత స్థానానికి చేరుకోవడానికి, అతను లేదా ఆమె కేవలం తెలివితేటలను కలిగి ఉంటే సరిపోదుబీ వారికి అత్యుత్తమ నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు మరియు సంపూర్ణ వ్యక్తిత్వం ఉండాలి. నాయకత్వం అనేది కేవలం అధికారాన్ని చెలాయించడం మాత్రమే కాదు, ఇతరులను లక్ష్యం వైపు నడిపించడానికి ప్రేరేపించడం, ప్రభావితం చేయడం మరియు మార్గనిర్దేశం చేయడం వంటి సామర్థ్యం. ఒక సమూహాన్ని, సంస్థను లేదా దేశాన్ని విజయవంతంగా నడిపించడంలో కీలక పాత్ర పోషించే అత్యంత ముఖ్యమైన అంశాలలో ఇవి ఒకటిగా గుర్తించబడతాయి, కాబట్టి వాటిని నేర్చుకోవడం మరియు ఆచరించడం చాలా అవసరం.

నిజమైన నాయకుడిలో కనిపించే ప్రధాన లక్షణం ఏమిటంటే, స్పష్టమైన ఆలోచన మరియు లక్ష్యాన్ని కలిగి ఉండటం. తమ బృందాన్ని ఎక్కడికి నడిపించాలనుకుంటున్నారో వారికి ఖచ్చితంగా తెలుసు, మరియు ఆ లక్ష్యాన్ని సాధించడానికి అనుసరించాల్సిన మార్గాన్ని గురించి వారికి ఒక స్పష్టమైన చిత్రం ఉంటుంది. ఈ దృష్టితో పాటు, నాయకుడు తమ ఆలోచనలను ఇతరులకు అర్థమయ్యే రీతిలో, ప్రేరణ కలిగించే విధంగా వివరించగలగాలి. ఈ స్పష్టమైన ఆలోచనా విధానం, సందిగ్ధతను తొలగించి, బృంద సభ్యులు అందరూ ఒకే దిశలో ప్రయాణించడానికి సహాయపడుతుంది, తద్వారా పనులు అనుకున్న సమయానికి, అనుకున్న ప్రమాణాలకు అనుగుణంగా పూర్తవుతాయి. మరొక కీలకమైన అంశం ఏమంటే, నాయకుడికి సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పుష్కలంగా ఉండాలి. నాయకత్వం వహించే ప్రయాణంలో ఎదురయ్యే సవాళ్లు, అడ్డంకులు మరియు ఊహించని పరిస్థితులకు త్వరగా ప్రతిస్పందించడం మరియు వాటిని అధిగమించడం చాలా అవసరం. ఒత్తిడితో కూడిన పరిస్థితులలో కూడా ప్రశాంతంగా ఉండి, అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి, అత్యుత్తమ నిర్ణయాలను తీసుకోగలగడం అనేది ఒక గొప్ప నాయకుడి లక్షణం. కేవలం నిర్ణయం తీసుకోవడమే కాకుండా, ఆ నిర్ణయం తీసుకున్న తర్వాత దాని పరిణామాలకు బాధ్యత వహించే ధైర్యం కూడా నాయకుడికి తప్పక ఉండాలి.

ప్రభావితం చేసే నైపుణ్యాలు, అంటే ఇతరులతో సమర్థవంతంగా మాట్లాడగలగడం, చర్చించగలగడం మరియు వినగలగడం నాయకత్వానికి మూలస్తంభం లాంటిది. ఒక నాయకుడు తమ ఆలోచనలను మరియు సూచనలను కేవలం ఉత్తర్వుల రూపంలో కాకుండా, ఒప్పించగలిగే విధంగా, హృదయానికి హత్తుకునే విధంగా వ్యక్తం చేయాలి. అదే సమయంలో, తమ బృంద సభ్యులు, సహోద్యోగులు లేదా ప్రజలు చెప్పే అభిప్రాయాలను మరియు ఆందోళనలను ఓపికతో ఆలకించడం, వారికి విలువ ఇవ్వడం అనేది బృందంలో నమ్మకాన్ని, పరస్పర గౌరవాన్ని పెంచుతుంది. ఈ విధంగా, వారు ఇతరుల నుండి ఉత్తమమైన వాటిని రాబట్టగలుగుతారు.

ఒక సంస్థ లేదా సమూహంలో నమ్మకాన్ని పెంచడానికి మరియు స్థిరత్వాన్ని తీసుకురావడానికి, నిజాయితీ మరియు పారదర్శకత (అంటే, దాగబడకుండా ఉండే స్వభావం) చాలా ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. నాయకులు తమ మాటల్లో, చేతల్లో స్థిరత్వం కలిగి ఉండాలి మరియు వారు తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలి. ఈ నిజాయితీ, బృంద సభ్యులు తమ నాయకుడిపై విశ్వాసం ఉంచడానికి దారితీస్తుంది, ఇది కష్ట సమయాల్లో కూడా బృందం నిలబడటానికి, కలిసి పనిచేయడానికి సహాయపడుతుంది. నమ్మకం లేని నాయకత్వం ఎక్కువ కాలం మనుగడ సాగించలేదు.

మరింత ముఖ్యమైన నైపుణ్యం ఏమంటే, తమ కింద పనిచేసేవారికి అధికారాన్ని బదిలీ చేయడం (అంటే, వారికి బాధ్యత అప్పగించడం) మరియు వారిని అభివృద్ధి చేయడానికి అవకాశాలను కల్పించడం. ఒక గొప్ప నాయకుడు అన్ని పనులను తానే చేయాలని ప్రయత్నించకుండా, సరైన వ్యక్తులను సరైన పాత్రలకు ఎంచుకుని, వారికి పనిని అప్పగించి, వారిని ప్రోత్సహిస్తాడు. దీనివల్ల బృంద సభ్యులు కూడా తమ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడానికి అవకాశం లభిస్తుంది, ఇది సంస్థకు కొత్త ఆలోచనలు మరియు పరిష్కారాలను అందిస్తుంది. ఈ విధంగా, నాయకుడు భవిష్యత్తు కోసం కొత్త నాయకులను తయారు చేయగలుగుతాడు. సంక్షోభాలను నిర్వహించడంలో మరియు మార్పులకు అనుగుణంగా మారడంలో నాయకుడి సామర్థ్యం కీలకమైనది. ప్రపంచం నిరంతరం మారుతున్నప్పుడు, ఒక నాయకుడు పాత పద్ధతులకు అంటుకుని ఉండకుండా, కొత్త ఆలోచనలను స్వాగతించడం మరియు మార్పును సానుకూలంగా స్వీకరించడం చాలా అవసరం. అనూహ్య సంఘటనలు జరిగినప్పుడు, కంగారు పడకుండా, త్వరగా పరిస్థితిని అంచనా వేసి, బృందాన్ని నిశ్శబ్దంగా మార్పు వైపు నడిపించగలిగే సామర్థ్యం ఒక నాయకుడి నైపుణ్యానికి నిదర్శనం. ఈ సామర్థ్యం సంస్థను దీర్ఘకాలికంగా నిలబెట్టడానికి ఉపయోగపడుతుంది.

చివరికి, నాయకత్వం అనేది నిరంతరంగా నేర్చుకునే ప్రక్రియ. ఒక ప్రభావవంతమైన నాయకుడు ఎప్పుడూ తనను తాను మెరుగుపరుచుకోవడానికి, కొత్త జ్ఞానాన్ని, నైపుణ్యాలను పొందడానికి సిద్ధంగా ఉంటాడు. తమ లోపాలను తెలుసుకోవడం, ఇతరుల నుండి అభిప్రాయాలను అంగీకరించడం మరియు వాటిని మెరుగుపరుచుకోవడం ద్వారా, వారు తమ బృందానికి ఒక ఆదర్శంగా నిలుస్తారు. ఈ విధంగా, ఉత్తమ నాయకత్వ లక్షణాలు మరియు నైపుణ్యాలు కలగలిసిన వ్యక్తి సంస్థకు మరియు సమాజానికి విలువైన సంపదగా మారతాడు, శాశ్వత విజయాన్ని సాధించడంలో తోడ్పడతాడు.

**– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు,**
**డిజైనర్ టెక్ గురు. 8897975262**

## గ్రూప్-1 అక్రమాలపై సుప్రీంకోర్టుకు కవిత లేఖ

చేస్తున్నారని కవిత లేఖలో తెలిపారు. అంతేకాకుండా, గ్రూప్–1 పేపర్ల మూల్యాంకనంలో తమకు అన్యాయం జరిగిందని తెలుగు మీడియం అభ్యర్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆమె పేర్కొన్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికైన 562 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసిన సంగతి తెలిసిందే. నియామకాలు పూర్తయిన నేపథ్యంలో కవిత సుప్రీంకోర్టుకు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## బండ్లగూడలో భారీగా గంజాయి పట్టివేత

అయిన మొహమ్మద్ కలీం ఉద్దీన్ షేక్ సోహైల్, మొహమ్మద్ అఫ్జల్ అలియాస్ అబ్బు గా గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుల వివరాలను కూడా డీసీపీ వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన రహమాన్ (ప్రధాన రవాణాదారుడు), ఒడిశాకు చెందిన జిథు, శ్రీకాకుళానికి చెందిన సురేష్, మహారాష్ట్రకు చెందిన మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని తెలిపారు. మహారాష్ట్రకు చెందిన మహేష్ ఈ గంజాయిని కొనుగోలు చేస్తుండగా, ఒడిశాలోని మల్కన్‌గిరి అటవీ ప్రాంతంలో సురేష్, జిథు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రకు సరఫరా చేయడానికి ప్లాన్ చేశారని చెప్పారు.

**– జీడిపప్పులో దాచి రవాణా**

నిందితులు 28 హెచ్‌డీపీఈ సంచుల్లో నింపిన గంజాయిని ఐషర్ డీసీఎం ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో జీడిపప్పు బస్తాల కింద దాచి, వాటిపై టార్పాలిన్ కప్పి హైదరాబాద్ మీదుగా నాసిక్ వైపు రవాణా చేస్తున్నట్లు డీసీపీ వివరించారు. పక్కా సమాచారంతో బండ్లగూడ వద్ద సోదాలు నిర్వహించగా ఈ భారీ గంజాయి పట్టుబడిందన్నారు.

పరారీలో ఉన్న నిందితుల్లో ప్రధాన నిందితుడు సురేష్, ఒక్క ట్రిప్‌కు రూ. 3 నుంచి 5 లక్షల పారితోషికం ఇస్తానని రెహమాన్‌కు ఆఫర్ చేయగా, దానితో రెహమాన్ గంజాయి సరఫరాకు అంగీకరించినట్లు విచారణలో తేలిందన్నారు. అరెస్ట్ అయిన నిందితులంతా చిన్ననాటి స్నేహితులుగా దర్యాప్తులో గుర్తించినట్లు డీసీపీ చైతన్య కుమార్ తెలిపారు. పోలీసులు నిందితుల నుంచి ఐషర్ డీసీఎం ట్రాన్స్‌పోర్ట్ వాహనం, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## హైదరాబాద్‌కు సౌత్‌వెస్ట్ పెట్టుబడులు

హైదరాబాద్‌లో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆధునిక సదుపాయాలు ఈ కేంద్రం విజయవంతం కావడానికి తోడ్పడతాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

తెలంగాణను మరింత ఉన్నత స్థితికి తీసుకువెళ్లడానికి రూపొందించిన 'తెలంగాణ ఎదుగుదల 2047' (తెలంగాణ రైజింగ్ 2047) ప్రణాళికను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ప్రణాళికలో భాగంగా, 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ (వెయ్యి బిలియన్లు) ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పం అని ఆయన స్పష్టం చేశారు. సౌత్‌వెస్ట్ విమానయాన సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థల సహకారం ఈ లక్ష్యాలను చేరేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో సంస్థ న్యాయ సలహా విభాగం అధిపతి జాసన్ ఫ్లైయింగ్, హెచ్ఈఎక్స్ సలహా బృందానికి చెందిన సార్థక్ బ్రహ్మ కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా ఈ చర్చల్లో భాగమయ్యారు. ఈ పెట్టుబడితో తెలంగాణలో నూతన ఉద్యోగాల కల్పన మెరుగుపడుతుందని అంచనా.

## కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో రైతుపై 'హింస' ఆరోపణలు



**హైదరాబాద్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఒక రైతును అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేశారనే తీవ్ర ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు దృష్టి సారించింది. కస్టడీలో హింసకు పాల్పడ్డారనే ఆరోపణలపై నాగర్‌కర్నూల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) తక్షణమే విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ములాచింతలపల్లి గ్రామానికి చెందిన రైతు చిరుమణి బాలరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ ఆదేశాలు జారీ చేశారు. బాలరాజు సెప్టెంబర్ 13న తన భూమిపై గ్రావెల్, రాళ్లు అక్రమంగా డంప్ చేసినందుకు గాను, గోడా కుర్మయ్య అనే వ్యక్తిపై ఫిర్యాదు చేయడానికి సెప్టెంబర్ 17న కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, ఫిర్యాదు స్వీకరించి చర్యలు తీసుకోవాల్సింది పోయి, పోలీస్ స్టేషన్‌లో ఉన్న సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్.ఐ) రిషికేష్, ఇద్దరు కానిస్టేబుళ్లు (జయరాజు, గౌస్) తనను అక్రమంగా నిర్బంధించారని బాలరాజు ఆరోపించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నాలుగు గంటల పాటు తనను తోలు బెల్టులు, లాఠీలతో అమానుషంగా కొట్టారని, ఇది రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనే కాకుండా, హత్యాయత్నమేనని ఆయన కోర్టుకు తెలిపారు. ఈ తీవ్ర ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఈ సంఘటనపై నాగర్‌కర్నూల్ ఎస్పీ వెంటనే సమగ్ర విచారణ నిర్వహించాలని ఆదేశించింది. పోలీసుల తీరుపై విచారణ నివేదికతో పాటు, సెప్టెంబర్ 17న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీస్ స్టేషన్‌లో రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని భద్రపరిచి, కోర్టుకు సమర్పించాలని ఎస్పీని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 6కు వాయిదా వేసిన హైకోర్టు, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నాగర్‌కర్నూల్ ఎస్పీ, కొల్లాపూర్ ఎస్.హెచ్.ఓ.లకు నోటీసులు జారీ చేసింది.

### మంత్రి వేధింపుల వల్లే

## సీనియర్ ఐఏఎస్ రిజ్వీ రాజీనామా



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవడం తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. 1999 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారికి పదవీ కాలం ఇంకా ఎనిమిదేళ్ల వరకు మిగిలి ఉండగా, అక్టోబర్ 31 నుండి అమలులోకి వచ్చేలా ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం దానిని ఆమోదించింది. అయితే, ఆయన రాజీనామాకు వెనుక అధికారిక కారణాల కంటే, రాజకీయ ఒత్తిడి మరియు మంత్రుల జోక్యం ప్రధాన కారణాలుగా ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం రెవెన్యూ (ప్రొహిబిషన్ ఎక్సైజ్) ప్రిన్సిపల్ సెక్రటరీగా రిజ్వీ విధులు నిర్వహిస్తున్నారు.

రిజ్వీ వీఆర్ఎస్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మంత్రుల మధ్య ఉన్న అంతర్గత విభేదాల కారణంగానే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సరైన పనులు చేయలేక, తప్పుడు పనులు చేయాలని ఒత్తిడికి గురవుతున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని బ్యూరోక్రాట్లు ముఖ్యమంత్రి ఒకవైపు, ఇతర కేబినెట్ మంత్రులు మరోవైపు నుండి ఒత్తిడి చేయడంతో "లోతైన సముద్రం మధ్య చిక్కుకుపోయినట్లుగా" ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి వేధింపుల వల్లే రిజ్వీ వీఆర్ఎస్ తీసుకున్నారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి, అధికారులపై వేధింపులకు నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. రిజ్వీ రాజీనామాకు ప్రధానంగా ఎక్సైజ్ శాఖలో టెండర్ల వివాదమే కారణమని తెలుస్తోంది. మద్యం సీసాలపై అతికించే హై-సెక్యూరిటీ హోలోగ్రామ్‌ల టెండర్ల ప్రక్రియను రిజ్వీ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. పాత వెండర్‌కే ప్రయోజనం చేకూర్చేలా రిజ్వీ వ్యవహరిస్తున్నారని, అందుకే టెండర్ల ప్రక్రియ ఆలస్యం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయమై మంత్రి జూపల్లి కృష్ణారావు ఏకంగా లిప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లికు లేఖ రాశారు. ఈ లేఖలో రిజ్వీపై చర్యలు తీసుకోవాలని, ఆయన వీఆర్ఎస్‌ను ఆమోదించవద్దని కూడా మంత్రి కోరినట్లు సమాచారం.

మంత్రి నుంచి తీవ్రమైన ఆరోపణలు, చర్యలు తీసుకోవాలని డిమాండ్లు ఎదురైన నేపథ్యంలోనే రిజ్వీ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. టెండర్ల అంశంలో మంత్రి ఆదేశాలను పాటించకుండా రిజ్వీ ఫైళ్లను తరలించారని, ఇది వ్యాపార నియమాలను ఉల్లంఘించడమేనని మంత్రి వర్గం ఆరోపిస్తోంది. మరోవైపు, తరుచూ జరుగుతున్న బదిలీల వల్ల విసిగిపోయి, వ్యక్తిగత లక్ష్యాల కోసం రిజ్వీ స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నారని సచివాలయ వర్గాల్లోనూ చర్చ నడుస్తోంది. గత రెండేళ్లలో ఆయన నాలుగుసార్లు బదిలీ అయ్యారు.

ఏది ఏమైనప్పటికీ, ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి పదవీకాలం ముగియకముందే రాజీనామా చేయడం, దాని వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనా వివాదాలు రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో చర్చకు దారితీశాయి. అధికారులపై రాజకీయ జోక్యం, ఒత్తిడి పెరుగుతోందనే ప్రతిపక్షాల ఆరోపణలకు ఈ ఘటన బలం చేకూర్చింది. ఈ మొత్తం వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పిగా మారింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073